

# అమ్మాయిలు అదరహో!

**ఆసియా బ్యాడ్మింటన్ టైటిల్ కైవసం**

షా ఆలమ్: భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో మన అమ్మాయిల జట్టు స్వర్ణం కొల్లగొట్టింది. సుదీర్ఘ కాలంగా అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఆసియా టైటిల్‌ను పీవీ సింధు సారథ్యంలోని భారత జట్టు ఒడిసిపట్టింది. ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ 3-2తో థాయ్‌లాండ్‌పై నెగ్గి మొదటిసారి ఈ టోర్నీ విజేతగా అవతరించింది. గతంలో ఈ టోర్నీలో పురుషుల జట్టు రెండుసార్లు (2016, 2020) కాంస్య పతకాలు గెలిచింది. టైలో భాగంగా జరిగిన తొలి సింగిల్స్ మ్యాచ్‌లో రెండు ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధు 21-12, 21-12తో సుపనిడా కాటెథాంగ్‌పై విజయం సాధించి జట్టుకు శుభారంభాన్నిచ్చింది. గాయం నుంచి కోలుకున్న తర్వాత తిరిగి పుంజుకునేందుకు కాస్త సమయం తీసుకున్న ఈ తెలుగమ్మాయి.. ఆసియా చాంపియన్‌షిప్‌తో మునుపటి ఫామ్ అందుకుంది. డబుల్స్ పోరులో పుల్లెల గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ జంట 21-16, 18-21, 21-16తో జాంకోల్ఫాన్-రవిండా ప్రా ద్వయంపై విజయం సాధించింది. ఆ తర్వాత సింగిల్స్‌లో అశ్మిత చలిహా డబుల్స్‌లో శృతి-ప్రియ ఓటమి పాలయ్యారు. దీంతో స్కోరు 2-2తో సమమైంది. ఈ సమయంలో జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో 17 ఏండ్ల అన్మోల్ 21-14-21-9తో ప్రత్యర్థిని చిత్తుచేయడంతో భారత జట్టు సంబురాల్లో మునిగిపోయింది.



## ఉమ్మడి జిల్లాకో మినీ స్టేడియం

**హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కమిటీలను ఏర్పాటు చేసింది. దీంతో పాటు ఉమ్మడి జిల్లాల్లో 10 మినీ స్టేడియంలు నిర్మించాలని తీర్మానించింది. ఆదివారం హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్‌రావు అధ్యక్షతన వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉప్పల్ స్టేడియంలో 250 మందికి బోర్డింగ్ సదుపాయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ ఎక్సలెన్స్ అకాడమీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఏజీఎంలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, శివ్‌లాల్ యాదవ్, అర్షద్ అయూబ్, వినోద్, అనిల్ జాన్ మనోజ్, హనుమంతరావు, చాముండేశ్వరినాథ్, వంకా ప్రతాప్, ఆగంరావు తదితరులు పాల్గొన్నారు.


## నితీశ్, ప్రజ్ఞయ్ సెంచరీలు

**హైదరాబాద్ 350**
**మేఘాలయతో రంజీ ప్లేట్ గ్రూప్ ఫైనల్**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నితీశ్ రెడ్డి (122; 13 ఫోర్లు, 4 సిక్సర్లు), ప్రజ్ఞయ్ రెడ్డి (102 నాటౌట్; 11 ఫోర్లు, ఒక సిక్సర్) సెంచరీలతో కదంతొక్కడంతో మేఘాలయతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ ఫైనల్లో హైదరాబాద్ మంచి స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 25/2తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 350 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తిలక్ వర్మ (44) రాణించాడు. అంతకుముందు మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆ జట్టు ఆట నిలిచే సమయానికి పరుగులేమీ చేయకుండా ఒక వికెట్ కోల్పోయింది.



ఇంటర్ డిస్ట్రిక్ట్ నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌లో గురుకుల విద్యార్థి రాజేశ్ కాంస్య పతకంతో మెరిశాడు.



బెంగాల్ కెప్టెన్ మనోజ్ తివారీ.. రిటైర్మెంట్ సందర్భంగా ఆదివారం కోల్‌కతాలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అతడిని ఘనంగా సత్కరించింది. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 10 వేలకు పైగా పరుగులు చేసిన తివారీకి భారత మాజీ కెప్టెన్ గంగూలీ ప్రత్యేక జ్ఞాపిక అందించాడు.

# రాజ్‌కోట్‌లో రవీంద్రజాలం

**తిప్పేసిన జడేజా • మూడో టెస్టులో భారత్ రికార్డు విజయం**

**434 పరుగుల తేడాతో రోహిత్ సేన విక్టరీ • యశస్వి జైస్వాల్ డబుల్ సెంచరీ**



జడేజా (5/41)

లోకల్‌బాయ్ రవీంద్ర జడేజా రాజ్‌కోట్‌లో దుమ్మురేపాడు. తొలి ఇన్నింగ్స్‌లో శతక్కొట్టిన ఈ ఆల్‌రౌండర్.. రెండో ఇన్నింగ్స్‌లో పాంచ్ పటాకా మోగించాడు!

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ వరుసగా రెండో డబుల్ సెంచరీతో కదంతొక్కడంతో.. ఇంగ్లండ్ ముందు కొండంత లక్ష్యం నిలువగా.. దూకుడుగా ఆడుదామనుకున్న ఇంగ్లిష్ బ్యాటర్లతో మన స్పిన్నర్లు ఆటాడుకున్నారు!!

ఫలితంగా టెస్టు క్రికెట్ చరిత్రలో టీమ్‌ఇండియా పరుగుల పరంగా అతిపెద్ద విజయాన్ని నమోదు చేసుకోవడంతో పాటు సిరీస్‌లో 2-1తో ముందంజ వేసింది.

రాజ్‌కోట్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన టీమ్‌ఇండియా.. టెస్టు క్రికెట్ చరిత్రలో అతిపెద్ద విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తొలి రెండు రోజులు నువ్వా నేనా అన్నట్లు సాగిన మూడో టెస్టు మ్యాచ్‌లో భారత్ 434 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. 557 పరుగుల లక్ష్యఛేదనకు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. 122 పరుగులకే చాప చుట్టేసింది. దీంతో రోహిత్ సేన జయభేరి మోగించింది. బజ్‌బాల్ పేరిట సుదీర్ఘ ఫార్మాట్‌లో సైతం టీ20 తరహాలో ఆడుతున్న ఇంగ్లండ్ బ్యాటర్ల పప్పులు ఈ సారి ఉడకలేదు. బెన్ డకెట్ (4) రనౌట్‌తో ప్రారంభమైన వికెట్ల పతనం చివరి వరకు కొనసాగింది. పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన మార్క్ వుడ్ (33) టాప్ స్కోరర్ కాగా.. క్రాలీ (11), పోప్ (3), రూట్ (7), బెయిర్‌స్టో (4), స్టోక్స్ (15), ఫోక్స్ (16) విఫలమయ్యారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 5 వికెట్లు ఖాతాలో వేసుకోగా.. కుల్దీప్ రెండు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 196/2తో నాలుగోరోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 430/4 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో ప్రత్యర్థి ముందు 557 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. యశస్వి (236 బంతుల్లో 214 నాటౌట్; 14 ఫోర్లు, 12 సిక్సర్లు) డబుల్ సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్ (91; 9 ఫోర్లు, 2 సిక్సర్లు), సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించారు. అస్వస్థత కారణంగా సెంచరీ తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన యశస్వి.. ఆ తర్వాత క్రీజులో అడుగు పెట్టి వీర విధ్వంసం సృష్టించాడు. ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపుతూ సిక్సర్ల జడివాన కురిపించాడు. ఈ క్రమంలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (12) కొట్టిన బ్యాటర్‌గా పాకిస్థాన్ దిగ్గజం వసీం అక్రమ్ సరసన నిలిచాడు. జడేజాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి రాంచీలో నాలుగో టెస్టు ప్రారంభం కానుంది.



యశస్వి (214*)

**1** టెస్టుల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కు ఇదే (434 పరుగులతో) అతి పెద్ద విజయం. 2021లో న్యూజిలాండ్‌పై 372 పరుగుల తేడాతో విజయం రెండో స్థానానికి చేరింది.

టెస్టుల్లో తొలి మూడు శతకాలను 150 ప్లస్ స్కోర్లుగా మలిచిన తొలి భారత ప్లేయర్‌గా జైస్వాల్ రికార్డుల్లోకెక్కాడు.

**1** ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (12) కొట్టిన ప్లేయర్‌గా జైస్వాల్.. పాకిస్థాన్ మాజీ ఆల్‌రౌండర్ వసీం అక్రమ్ సరసన చేరాడు.

### సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 319; భారత్ రెండో ఇన్నింగ్స్: 430/4 డిక్లేర్డ్ (యశస్వి 214 నాటౌట్, గిల్ 91; హార్ట్‌లీ 1/78); ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 122 (వుడ్ 33; జడేజా 5/41, కుల్దీప్ 2/19).

# ఆడపిల్లకు ఆసరా



## సుకన్య సమృద్ధితో రూ. 70 లక్షల భరోసా

*సుకన్య సమృద్ధి స్కీం.. ఆడపిల్లలున్న తల్లిదండ్రులకు ఎంతోకొంత ఈ కేంద్ర ప్రభుత్వ పథకం గురించి అవగాహన ఉండే ఉంటుంది. పన్ను రాయితీ, వడ్డీ, దీర్ఘకాల మదుపు సదుపాయం, స్వల్ప మొత్తాల్లో కూడా పెట్టుబడి వంటివి ఈ పథకంలో ఉన్న ప్రయోజనాలు. తాజాగా ఈ స్కీంకు 8.2 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంతకీ ఈ పథకంలోని లాభాలు ఏమిటి? ఏ మేరకు ఇన్వెస్ట్ చేయవచ్చు?*

**సురక్షితమైన** పెట్టుబడులు, ఆడపిల్లల భవిష్యత్తుకు పెద్ద పీట వేసేవారికి సుకన్య సమృద్ధి స్కీం (ఎస్ఎస్‌వై) సరైనది. నెలకు రూ.12,500 పెట్టుబడి (ఏటా రూ.1.5 లక్షలు)తో 8 శాతానికి పైగా వడ్డీ అందితే ఆఖర్లో రూ.70 లక్షల వరకు అందుకునే సౌకర్యం ఈ పథకంలో ఉన్నది.

### ఎవరు అర్హులు?

- భారతీయులై ఉండాలి.
- ఆడపిల్లల తల్లిదండ్రులు లేదా గార్డియన్‌లకు మాత్రమే అర్హత ఉంటుంది.
- అమ్మాయి వయసు పదేండ్లు నిండేలోగానే స్కీం తీసుకోవాల్సి ఉంటుంది.
- ఒక్కరికి ఒక్క ఖాతానే తెరుస్తారు.
- కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరికి మాత్రమే స్కీం వర్తిస్తుంది.

### ఖాతా ఎలా తెరవాలి?

పోస్టాఫీసు, ఎంపిక చేసిన బ్యాంకుల్లో మాత్రమే ఈ స్కీం ఖాతాల్ని ఓపెన్ చేయవచ్చు. ఏడాదికి కనిష్ఠంగా రూ.250, గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఒకేసారి లేదా వాయిదాల్లో కూడా పెట్టుబడిగా పెట్టే వెసులుబాటు ఉన్నది.

**8.4% వడ్డీతో ఏటా రూ.1.5 లక్షల పెట్టుబడి (నెలకు రూ.12,500)కి**

| సంవత్సరం | వయస్సు | ప్రారంభం | వార్షిక పెట్టుబడి | వడ్డీ రేటు | ముగింపు | 50% విత్‌డ్రాకు అనుమతి |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | - | 1,50,000 | 8.40% | 1,62,600 | - |
| 2 | 3 | 1,62,600 | 1,50,000 | 8.40% | 3,38,858 | - |
| 3 | 4 | 3,38,858 | 1,50,000 | 8.40% | 5,29,923 | - |
| 4 | 5 | 5,29,923 | 1,50,000 | 8.40% | 7,37,036 | - |
| 5 | 6 | 7,37,036 | 1,50,000 | 8.40% | 9,61,547 | - |
| 6 | 7 | 9,61,547 | 1,50,000 | 8.40% | 12,04,917 | - |
| 7 | 8 | 12,04,917 | 1,50,000 | 8.40% | 14,68,730 | - |
| 8 | 9 | 14,68,730 | 1,50,000 | 8.40% | 17,54,703 | - |
| 9 | 10 | 17,54,703 | 1,50,000 | 8.40% | 20,64,698 | - |
| 10 | 11 | 20,64,698 | 1,50,000 | 8.40% | 24,00,733 | - |
| 11 | 12 | 24,00,733 | 1,50,000 | 8.40% | 27,64,995 | - |
| 12 | 13 | 27,64,995 | 1,50,000 | 8.40% | 31,59,854 | - |
| 13 | 14 | 31,59,854 | 1,50,000 | 8.40% | 35,87,882 | - |
| 14 | 15 | 35,87,882 | 1,50,000 | 8.40% | 40,51,864 | - |
| 15 | 16 | 40,51,864 | 1,50,000 | 8.40% | 45,54,821 | - |
| 16 | 17 | 45,54,821 | - | 8.40% | 49,37,426 | - |
| 17 | 18 | 49,37,426 | - | 8.40% | 53,52,169 | 24,68,713 |
| 18 | 19 | 53,52,169 | - | 8.40% | 58,01,751 | 26,76,085 |
| 19 | 20 | 58,01,751 | - | 8.40% | 62,89,099 | 29,00,875 |
| 20 | 21 | 62,89,099 | - | 8.40% | 68,17,383 | 31,44,549 |
| 21 | 22 | 68,17,383 | - | 8.40% | 73,90,043 | 34,08,691 |

*నోట్: ప్రతి నెలా 5వ తేదీలోపు నెలవారీ మొత్తాన్ని చెల్లించాలి.*

### వడ్డీరేటు ఎంత?

ప్రతీ 3 నెలలకోసారి ఈ పథకం వడ్డీరేటును సమీక్షించి ఓ నిర్ణయం తీసుకుంటారు. ప్రభుత్వ సెక్యూరిటీల వడ్డీరేట్లలోని హెచ్చుతగ్గుల ఆధారంగా స్వల్ప మార్పులుంటాయి. ఈ ఏడాది జనవరి-మార్చికిగాను 8.2 శాతం వడ్డీరేటును నిర్ణయించారు. గతంలో ఓసారి ఏకంగా 9.2 శాతం వడ్డీనిచ్చారు. ఇప్పటిదాకా కనిష్ఠ స్థాయి 7.6 శాతం.

### వడ్డీని ఎలా జమ చేస్తారు?

ప్రతి నెలా 5వ తేదీ నుంచి నెలాఖర్లోగా మీ ఖాతాలో ఉన్న సొమ్ముకు మాత్రమే వడ్డీని లెక్కిస్తారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిశాకే (మార్చి 31 తర్వాత) ఈ వడ్డీని ఖాతాల్లో జమ చేస్తారు.

### పన్ను ప్రయోజనాలు?

ఈ పథకంలో లాభం అంతా పన్ను మినహాయింపులదే. నగదు చెల్లించినా, ఉపసంహరించినా ఎలాంటి పన్నూ ఉండదు. సెక్షన్ 80సి కింద గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకూ ట్యాక్స్ డిడక్షన్ కోసం క్లెయిం చేసుకోవచ్చు.

### చివరగా..

ఈ పథకానికి 21 ఏండ్ల సుదీర్ఘ లాకిన్ పీరియడ్ ఉంటుంది. లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్ తర్వాత పెద్ద మొత్తంలో సొమ్ము చేతికి రావాలనుకునేవాళ్లకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. మనం ఇన్వెస్ట్ చేసే వివిధ అసెట్ క్లాసుల్లో కొద్ది మొత్తాలను సేఫ్, సెక్యూర్డ్, మినిమం గ్యారెంటీ రిటర్నుల కోసం కూడా చూడాలి. ఆ కోవలోకే వస్తుంది ఈ సుకన్య సమృద్ధి స్కీం.

-నాగేంద్రసాయి కుందవరం

### అవసరానికి నగదు తీసుకోవచ్చా?


*రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ), ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) తరహాలో కాకుండా ఇందులో నగదు ఉపసంహరణ కాస్త భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఈ పథకం ప్రధాన ఉద్దేశమే ఆడపిల్ల పెండ్లి, చదువుకు పైసలు అందిరావడం. అందుకే పథకం ప్రారంభించిన 21 సంవత్సరాలకే మెచ్యూరిటీ ఉంటుంది. కానీ ఖాతా ప్రారంభించిన 15 ఏండ్లదాకా మీరు నగదును జమ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 6 ఏండ్ల పాటు ఎలాంటి పెట్టుబడి లేకపోయినా వడ్డీ జమవుతూ ఉంటుంది. అమ్మాయికి 18 ఏండ్లు దాటిన తర్వాత, ఆమె పెండ్లికి అవసరమైనప్పుడు ఈ నిధులను ఉపసంహరించుకునే వీలున్నది. అంతేగాక జమైన కార్పస్ మొత్తంలో 50 శాతం వరకూ బిడ్డ చదువు కోసం కూడా విత్‌డ్రా చేయవచ్చు. అయితే ఇందుకు ఆమె వయస్సు 16 ఏండ్లు దాటాలి లేదా కనీసం 10వ తరగతి పాసైనా అవ్వాలి. ఇక సంరక్షకుడో, తల్లిదండ్రులో మరణించినా ఈ నిధులను విత్‌డ్రా చేసుకోవచ్చు. లేదా ఖాతాదారు ఏదైనా తీవ్ర వ్యాధి బారినపడినా, మరణించినా కూడా ఈ నిధులను చెల్లిస్తారు. అయితే ఖాతా తెరిచిన 5 ఏండ్ల తర్వాతే వర్తిస్తుంది.*



# రాబడి

## పాజిటివ్ ట్రెండ్‌లోనే నిఫ్టీ

**మార్కెట్ పల్స్**



అమెరికా వడ్డీరేట్లు త్వరితంగా తగ్గవని సంకేతాలిస్తూ అక్కడి ఆర్థిక గణాంకాలు బలంగా వెలువడుతున్నప్పటికీ భారత్‌తో సహా ప్రపంచ మార్కెట్లన్నీ ఒడిదొడుకులన్నప్పటికీ సానుకూలంగా ముగిశాయి. ఈ క్రమంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 గతవారం 1.19 శాతం పెరిగి 22,041 పాయింట్ల వద్ద ముగిసింది. ఇందుకు భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం, పారిశ్రామిక ఉత్పత్తి పెరగడం సహకరించాయి. ఈ నేపథ్యంలో ఈవారం సైతం ట్రెండ్ పాజిటివ్‌గా ఉంటుందని విశ్లేషకులు పేర్కొన్నారు. నిఫ్టీ 20డీఎంఏ, 50 డీఎంఏ ఎగువన ముగియటం సానుకూల ట్రెండ్‌కు దోహదపడుతున్నదని సాంకో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోదీ చెప్పారు. ఇప్పటి వరకు ఏ వారంలో ముగియనంత గరిష్ఠ స్థాయిలో నిఫ్టీ ముగియటం పాజిటివ్‌నెస్‌ను సూచిస్తున్నదని యాక్సిస్ సెక్యూరిటీస్ రీసర్చ్ హెడ్ రాజేశ్ పాల్వియా తెలిపారు.

**నిఫ్టీ తక్షణ మద్దతు 21,800**

ఈవారం ఒడిదొడుకులు ఏర్పడితే తక్షణం 21,800 స్థాయి మద్దతు ఇవ్వవచ్చని 22,400 దిశగా కదలవచ్చని ఛాయిస్ బ్రోకింగ్ ఈడీ సుమిత్ బగాడియా అంచనావేశారు. ఈ వారం 22,222 స్థాయి నిరోధాన్ని కల్పించవచ్చని, ఆ స్థాయిని దాటితే 22,300 స్థాయిని అందుకోవచ్చునని జిమిత్ మోదీ విశ్లేషించారు. వీక్లి మద్దతు 21,650 వద్ద ఉన్నదన్నారు.

## పన్ను ఆదా పెట్టుబడులు

### సీనియర్ సిటిజన్ల కోసం ఉన్న మార్గాలేవి

**ఆర్థిక** ప్రణాళికలో ట్యాక్స్ సేవింగ్స్ కీలకం. సరైన పద్ధతిలో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో పన్నులను ఆదా చేసుకోవచ్చు. సాధారణంగానే సీనియర్ సిటిజన్లకు మరిన్ని అవకాశాలుంటాయి. వాటిలో..

**ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీలు**

ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సి కింద ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ)ల్లో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. పైగా బ్యాంకుల్లో ఎఫ్‌డీలకు వృద్ధులకైతే అదనపు వడ్డీ కూడా ఉంటుంది. అలాగే నెల, 3 నెలలు, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు.

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

**ట్యాక్స్ ఫ్రీ బాండ్లు**

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరఫున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

**ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీములు**

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీము (ఈఎల్ఎస్ఎస్)లు కూడా అద్భుతమైన పన్ను ప్రయోజనాలకు నెలవు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సి కింద ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.